ప్రజా విశ్వంభర

యాక్షన్ ప్రియులను అలరించేలా జుమాంజి

యాక్షన్ అడ్వెంచర్ చిత్రాలను ఇష్టపడేవారిని విశేషంగా అలరించిన ఫిల్మ్ సిరీస్ 'జుమాంజి'. ఇప్పటివరకూ నాలుగు చిత్రాలు ఈ సిరీస్‌లో రాగా, చివరిది 'జుమాంజి: ఓపెన్' వరల్డ్ విడుదలకు సిద్ధమైంది. డిసెంబరు 25న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించనుంది. ఇంగ్లీష్‌తో పాటు, భారతీయ భాషల్లో 'జుమాంజి: ఓపెన్ వరల్డ్' రానుంది. ఈ సందర్భంగా సోనీ పిక్చర్స్ తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది. 'జుమాంజి' వీడియోగేమ్ ఆడేవారు నేరుగా అందులోని పాత్రల్లోకి వెళ్లిపోతారు. ఆ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ గేమ్ గెలవాల్సి ఉంటుంది. లేకపోతే, ప్రాణాలు కోల్పోతారు. మరి ఈ సారి జుమాంజి ప్రపంచంలో ఏం జరిగింది? అక్కడి జంతువులు వాస్తవ ప్రపంచంలోకి ఎలా వచ్చాయి? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే! డ్వేన్ జాన్సన్, జాక్ బ్లాక్, కెవిన్ హర్ట్, కారెన్ గిల్లాన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి జేక్ కస్డాన్ దర్శకత్వం వహిస్తున్నారు.

100 మంది జానపద రిథమ్ కళాకారులతో టైటిల్ సాంగ్

రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ నటుడిగా అరంగేట్రం చేస్తున్న చిత్రం 'ఎల్లమ్మ'. 'బలగం' చిత్రంతో డైరెక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న జబర్దస్త్ వేణు యెల్దండి నుంచి వస్తున్న ఈ రెండొవ చిత్రం నుంచి తాజాగా టైటిల్ సాంగ్‌కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ దేశంలోని విభిన్న సంస్కృతులకు చెందిన 100 మంది జానపద రిథమ్ కళాకారులతో కలిసి ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను రికార్డ్ చేశారు. ఈ విషయాన్ని తెలుపుతూ అందుకు సంబంధించిన ఫొటోలను కూడా సోషల్ మీడియా వేదికగా చిత్ర బృందం పంచుకోగా.. ప్రజెంట్ ఈ ఫొటోస్ వైరల్ అవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కాగా.. ఈ సినిమా 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. అలాగే ఈ సినిమాలో దేవిశ్రీ ప్రసాద్‌ను 'పర్షి' పాత్రలో పరిచయం చేస్తూ ఇటీవల వదిలిన ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా సినిమాపై హైప్‌ను పెంచుతోంది. దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఆ ఖాతాలు నావి కావు.. నమ్మొద్దు: జాసన్ సంజయ్

తన పేరుతో ఎలాంటి అధికారిక అభిమాన సంఘాలు ప్రారంభించలేదని, ఎవరికీ ఆ అనుమతి ఇవ్వలేదని తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు, దర్శకుడు జాసన్ సంజయ్ స్పష్టం చేశారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను వెల్లడిస్తూ.. మిగతావన్నీ నకిలీవేనని తెలిపారు. ''నా పేరు, ఫొటోతో ఉన్న నకిలీ ఖాతాలేవీ నాకు సంబంధించినవి కావు. ఆయా ఖాతాల నుంచి వచ్చే పోస్టులు, కామెంట్లతో నాకెలాంటి సంబంధం లేదు. వాటికి నేను బాధ్యత వహించను. నా పేరుతో ఎవరైనా అధికారిక అభిమాన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రచారం చేస్తే నమ్మొద్దు'' అని జాసన్ సోషల్ మీడియా వేదికగా రాసుకొచ్చారు. కాగా, ఇటీవల సందీప్ కిషన్ కథానాయకుడిగా నటించిన 'సిగ్మా' (Sigma)తో జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమయ్యారు. అక్టోబర్ 2న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు వచ్చింది.

శూర్పణఖ పాత్రను కొత్త కోణంలో చూపించబోతున్నాం: రకుల్

రణ్‌బీర్ పూర్, సాయిపల్లవి సీతారాములుగా వస్తోన్న మోస్ట్ అవైటేడ్ మూవీ రామాయణ:రైజ్ ఆఫ్ ఏ లెజెండ్. ఈ మొదటి భాగాన్ని ఈ దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో యశ్ రావణుడిగా కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన ట్రైలర్, సాంగ్స్ ఆడియన్స్‌ను ఆకట్టుకున్నాయి. ఇప్పటికే ఈ మూవీ ప్రీమియర్ షోను కాలిఫోర్నియాలో ప్రదర్శించారు. ఓవర్‌సీస్‌లోనూ టికెట్ బుకింగ్స్ ఓపెన్ కావడంతో ప్రీ సేల్స్‌లోనూ రామాయణ దూసుకెళ్తోంది. ఇందులో శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా మేకర్స్ ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'జనస్థాన యువరాణి శూర్పణఖ..' అని పేర్కొంటూ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రకుల్.. తన పాత్ర గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "శూర్పణఖ పాత్ర పోషించడం ఎంతో ప్రత్యేకమైన అనుభవం. రామాయణ యుద్ధానికి ప్రధాన కారణాల్లో శూర్పణఖ కూడా ఒకరు. చాలామందికి ఈ విషయం తెలియదు. ఆమెను అందరూ అపార్థం చేసుకున్నారు. ఈ సినిమాలో శూర్పణఖని కొత్త కోణంలో చూపించబోతున్నాం. అలాంటి పాత్రను పోషిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది." "తరతరాలుగా ప్రజల హృదయాల్లో నిలిచి, మన సంస్కృతిలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఈ కథలో భాగం కావడం గౌరవంగా భావి-స్తున్నా. ప్రేక్షకులు నా పాత్రను ఎప్పుడు చూస్తారా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఈ సినిమాతో భారతీయ చరిత్ర, సంస్కృతిని ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నాం. ఇలాంటి భిన్న కోణాలున్న పాత్రలో నటించడం ఆసక్తికరంగా అనిపించింది" ఇక, ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటిస్తున్నారు. సన్నీ దేవోల్ హనుమంతుడి పాత్రలో కనిపించనున్నారు. హన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. నవంబర్ 5న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ మూవీస్‌ను దాదాపు రూ. 4,000 కోట్ల బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు.

'ఈథ' .. వాళ్ల సహకారంతోనే చేయగలిగా

– శ్రద్ధా కపూర్

మరాఠీ 'లావణి' నృత్య సంప్రదాయాల నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఈథ' . ప్రముఖ లావణి కళాకారిణి 'విఠాబాయి నారాయణ్ గావ్‌కర్' జీవితం ఆధారంగా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ చిత్రాన్ని రూపొందించారు. నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. 'స్త్రీ 2' తర్వాత ఆమె నటిస్తున్న చిత్రమిది. తాజాగా మేకర్స్ ముంబయిలో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధా మాట్లాడుతూ.. సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు."ఈ మూవీలో భాగమయ్యే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. 'ఛావా' తర్వాత లక్ష్మణ్ సర్ మరేదైనా కథను ఎంచుకుని సినిమా తీయొచ్చు. కానీ, ఆయన అలా చేయకుండా మరో ప్రపంచాన్ని చూపించాలనుకున్నారు. అందుకే ఈ అద్భుతమైన నిర్ణయా-న్ని తీసుకున్నారు. ఇందులో నేను భాగమైనందుకు మా ఇంట్లో వాళ్లు గర్వపడుతున్నారు. మా అత్త, నాన్న కళాకారులే. నేను కూడా. కళాకారుల జీవితం గురించి తెరపై చూపించే చిత్రంలో భాగం కావడం ఆనందంగా ఉంది" అని ఆమె పేర్కొన్నారు." 'లావణి' నేర్చుకోవడానికి ఎంతో సాధన చేయాల్సి వచ్చింది. ఆ సమయంలో చిత్ర బృందం నాకు ఎంతో మద్దతిచ్చింది. అందరి సహకారంతోనే ఈ సినిమా చేయగలిగా. తెర వెనక కళాకారులు పడే కష్టాలు చాలా ఉంటాయి. వాటిని ఎవ్వరూ పట్టించుకోరు. వాళ్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు. మా సినిమాలో ఆ కష్టాన్ని కూడా చూపించబోతున్నాం" అని శ్రద్ధా తెలిపారు. ఇక, ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో కనిపించనుండగా.. రణ్‌దీప్ హుడా, మహ్మద్ జీషాన్ అయ్యూబ్, సిద్ధార్థ్ జాదవ్, అనంత్ జోషి, అక్షర సింగ్, ఉల్కా గుప్తా కీలక పాత్రలు పోషిస్తున్నారు. అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్నారు. దినేశ్ విజన్, లక్ష్మణ్ ఉటేకర్, కరిష్మా శర్మ నిర్మిస్తున్నారు. డిసెంబరు 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసిన కామ్రేడ్ కళ్యాణ్

హీరో శ్రీవిష్ణు నటించిన లేటెస్ట్ మూవీ 'కామ్రేడ్ కళ్యాణ్' థియేటర్స్‌లోకి వచ్చిన మూడు వారాల్లోనే డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధం అయింది. కోన వెంకట్ సమర్పణలో వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మించిన ఈ మూవీకి జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహించాడు. శ్రీవిష్ణు ప్రధాన పాత్రలో, రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, సత్య తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం అక్టోబర్ 9న థియేట్రర్స్‌లోకి వచ్చింది. పాజిటివ్ ఎక్స్‌పెక్టేషన్స్ మధ్య వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేకపోయింది. దీంతో తాజాగా సైలెంట్‌గా డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోలో అక్టోబర్ 30 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా సైలెంట్‌గా ఈ చిత్రం ఓటీటీ స్ట్రీమింగ్‌కు రావడంతో ఆశ్చర్యపోతున్నారు నెటిజన్లు.

నాకు ప్రయోగాలు చేయడం అంటే చాలా ఇష్టం

హీరోయిన్ కీర్తి సురేష్ ప్రస్తుతం 'అక్క' సిరీస్‌తో బిజీగా ఉంది. ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ఇక ఈ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా తను ఎంచుకునే పాత్రల గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది కీర్తి. 'కొన్ని సినిమాలను నేను కేవలం నా వ్యక్తిగత సంతృప్తి కోసం మాత్రమే చేస్తాను. కొత్తగా ప్రయోగాలు చేయాలని, భిన్నమైనవి చేయాలని నాకు ఉంటుంది. గత 2-3 ఏళ్లలో నేను కొన్ని కామెడీ చిత్రాల్లో నటించాను. అటువంటి పాత్రలు చేయడం నాకు ఎంతో ఇష్టం.ఇప్పుడు నటిస్తున్న 'అక్క' షూటింగ్ పూర్తయ్యాక, ఒక కామెడీ సినిమాలో నటించాను. అది చాలా తేలికగా, హాయిగా సాగిపోయింది. నాలోని ఉత్సాహాన్ని బయటకు తీసుకురావడానికి, అసలైన 'నేను' నేనుగా ఉండటానికి ఆ పాత్ర ఎంతగానో సహాయపడింది. విభిన్నమైన పాత్రల్లో నటించడం నాకు ఇష్టం. దీన్ని ఒక రిస్క్ అని మీరు అంటే, నాకు రిస్క్ తీసుకోవడం ఇష్టమేనని చెబుతాను. ఎందుకంటే నాకు ప్రయోగాలు చేయడం అంటే చాలా ఇష్టం. నేను ఒకే రకమైన పాత్రల పరిధిలో ఉండిపోకూడదు. అన్నింటినీ అన్వేషించాలి, నిరంతరం నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవాలి'అంటూ తన అభిప్రాయాన్ని బయపెట్టింది కీర్తిసురేష్.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com